# శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం

## అడ్మిన్  ఆఫీసు , ములుగు (గ్రామం & మండలం), సిద్దిపేట్ జిల్లా – తెలంగాణ

### తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి వాతావరణ ఆధారిత ఉద్యాన సలహాలు

**09-04-2026 నుండి 15-04-2026**

**గత రెండు రోజుల వాతావరణం**

రాష్ట్రంలో గత రెండు రోజులుగా వాతావరణం పొడిగా కొనసాగింది. గరిష్ట ఉష్ణోగ్రతలు: 37 నుండి 38 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రతలు: 24 నుండి 26 డిగ్రీల సెల్సియస్ గాను నమోదయ్యాయి.

**వచ్చే ఐదు రోజుల వాతావరణ సూచన**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం పగటి ఉష్ణోగ్రతలు 37 నుండి 39 డిగ్రీల సెల్సియస్ మధ్య రాత్రి ఉష్ణోగ్రతలు 24 నుండి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.

**వాతావరణ ఆధారిత కూరగాయల సలహాలు**

**వాతావరణ జాగ్రత్తలు**

- ఏప్రిల్ నెలలో సాధారణంగా వచ్చే ఈదురు గాలులు, ఉరుములు, గాలివానలను గమనించి పంటలను రక్షించాలి.

**నీటి నిర్వహణ**

- ఉదయం లేదా సాయంత్రం సమయంలో అవసరానికి అనుగుణంగా నీరు పెట్టాలి.
- నీటి వినియోగాన్ని తగ్గించేందుకు డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రాధాన్యంగా ఉపయోగించాలి.

**నేల ఆరోగ్యం మరియు మల్చింగ్**

- నేలలో ఉండే వ్యాధికారకాలను తగ్గించేందుకు లోతుగా దున్నాలి.
- నీరు నిల్వ కాకుండా సరైన డ్రైనేజీ ఏర్పాటు చేయాలి.
- పొడి ఆకులు, గడ్డి లేదా ప్లాస్టిక్ మల్చింగ్ ఉపయోగించి నేల తేమను కాపాడాలి మరియు కలుపు మొక్కలను నియంత్రించాలి.

**పంట స్థాపన మరియు అంతర వ్యవసాయ చర్యలు**

- కలుపు తొలగింపు, గోతులు చేయడం, మట్టిని మొక్కల వద్ద ఎత్తడం వంటి పనులు చేయాలి.
- ప్రతి ఐదు వరుసల తర్వాత మొక్కజొన్నను సరిహద్దు పంటగా పెంచి వేడి గాలులు మరియు పురుగుల నుంచి రక్షణ పొందాలి.
- బీరకాయ, దొండకాయ, బీన్స్ వంటి పంటలకు మద్దతు (స్టేకింగ్/ట్రెల్లిస్) ఇవ్వాలి.

**వేసవి సీజన్‌కు అనుకూల పంటలు**

- సొరకాయ, బీరకాయ, దోసకాయ, బెండకాయ, కాకరకాయ, తోటకూర వంటి వేడి తట్టుకునే పంటలను సాగు చేయాలి.

**వేడి ఒత్తిడి నిర్వహణ**

- నర్సరీలు మరియు చిన్న మొక్కలను 50% షేడ్‌నెట్‌తో కప్పి రక్షించాలి.

**కోత మరియు భద్రత**

- పంటలను ఉదయం వేళల్లో కోయడం వల్ల నాణ్యత నిల్వ ఉంటుంది.
- పంట కోతకు ముందు రసాయనాల వినియోగాన్ని నివారించాలి.

**పురుగు మరియు వ్యాధి నిర్వహణ**

- ఎకరాకు 20 పసుపు + 20 నీలం జిగురు అట్టలు ఏర్పాటు చేసి తెల్లదోమ, తామర పురుగును నియంత్రించాలి.
- టమోటా, వంకాయ, మిర్చిలో పెనుబంక, తెల్లదోమ నియంత్రణకు:
- ఇమిడాక్లోప్రిడ్ @ 0.3 మి.లీ/లీ లేదా ఫిప్రోనిల్ @ 2 మి.లీ/లీ

**నల్ల తామర పురుగులు నియంత్రణకు**

- స్పినెటోరామ్ @ 1.0 మి.లీ/లీ లేదా బోవేరియా బాసియానా @ 5 గ్రా/లీ

**చీడపీడలు, లీఫ్ మైనర్ నియంత్రణకు**

- ఫ్లుబెండియమైడ్ + థియాక్లోప్రిడ్ @ 0.5 మి.లీ/లీ లేదా స్పినోసాడ్ @ 0.3 మి.లీ/లీ
- అధిక ఉష్ణోగ్రతలలో వేప నూనె లేదా సేంద్రీయ మందులు ఉపయోగించడం మంచిది.
- తెల్లదోమ, ఫ్రూట్ ఫ్లై నియంత్రణకు స్టిక్కీ ట్రాప్స్, ఫెరోమోన్ ట్రాప్స్ ఏర్పాటు చేయాలి.
- బెండకాయ, దోసకాయ, గుమ్మడి వర్గాలలో మోసాయిక్ వ్యాధి నివారణకు
- ఇమిడాక్లోప్రిడ్ 17.8 SL @ 0.3 మి.లీ/లీ లేదా అసెటామిప్రిడ్ 20 SP @ 0.3 గ్రా/లీ లేదా డైమిథోయేట్ 30 EC @ 1 మి.లీ/లీ.

**బీన్స్ పంటలో ( చిక్కుడు, గోరు చిక్కుడు, అలసందలు ) రస్ట్ వ్యాధి నివారణకు**

- హెక్సాకోనాజోల్ 5 EC @ 1 మి.లీ/లీ లేదా టెబుకోనాజోల్ 25 EC @ 1 మి.లీ/లీ
- **మిరప** - పూర్తిగా పండిన పచ్చ లేదా ఎర్ర మిరపకాయలను 7–10 రోజుల వ్యవధిలో కోయాలి; తడి సమయంలో కోయకూడదు, ఉదయం లేదా సాయంత్రం కోయాలి. మిరపకాయలను పలుచగా పరచి 7–10 రోజులు ఎండలో ఆరబెట్టాలి. తరచూ తిప్పాలి మరియు నేలపై నేరుగా వేయకూడదు. పూర్తిగా ఆరిన తర్వాత 8-10% తేమగోనే సంచుల్లో చల్లని, పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి.
- **బంగాళదుంప** - మార్కెట్‌కు పంపే ముందు గడ్డలను గ్రేడింగ్ (రకాలుగా విభజించడం) చేయండి; పాడైపోయిన లేదా దెబ్బతిన్న గడ్డలను ఏరివేసి చల్లని ప్రదేశంలో భద్రపరచండి.

పండ్లు

- **మామిడి** – పండు అభివృద్ధి దశలో  చెట్టు కాండం నుండి 1 మీటరు దూరంలో బిందు సేద్యం ద్వారా 4 గంటల పాటు నీటిని అందించాలి . తామర పురుగులు వంటి రసం పీల్చే పురుగుల వ్యాప్తి ఉన్నప్పుడు, లీటరు నీటికి 0.5 గ్రాముల చొప్పున థియామెథాక్సామ్ లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల చొప్పున ఫిప్రోనిల్ మందును  పిచికారీ చేయాలి. కాయల పైన పక్షి కన్నుతెగులు (ఆంత్రాక్నోస్) మచ్చల వ్యాప్తిని నియంత్రించడానికి లీటరుకు 2 గ్రాముల చొప్పున కార్బెండజిమ్ + మాంకోజెబ్  మిశ్రమం  పిచికారీ చేయాలి. తామర పురుగులను సమర్థవంతంగా నియంత్రించడానికి ఎకరానికి 10 చొప్పున నీలి రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలి. గుడ్డు పరిమాణంలో ఉన్న పండ్లను పురుగులు, వ్యాధుల వ్యాప్తి మరియు అకాల వర్షాల నుండి రక్షించడానికి పండ్ల రక్షణ సంచులతో (fruit bags) కప్పాలి. సంచులను పండు కాడ చివర నుండి 2-3 సెంటీ మీటర్ల ఎత్తులో కట్టాలి.పండు ఈగల సమర్థవంతమైన నియంత్రణ కోసం, ఎకరానికి 4 నుండి 5 చొప్పున మిథైల్యూజెనాల్ ఫెరోమోనే  ఉచ్చులను అమర్చండి.
- **నిమ్మ మరియు బత్తాయి** – నిమ్మ మరియు బత్తాయి తోటలలో కాయ రాలకుండా నివారించడానికి మరియు కాయచక్కగా పెరగడానికి నేలలో తగినంత తేమను కాపాడుకోవాలి. కాయ పెరుగుదలను మెరుగుపరచడానికి సిట్రస్స్పెషల్‌ను 5g/l నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నిమ్మలో సిట్రస్క్యాంకర్/గజ్జి తెగులు గమనించినట్లయితే, తెగులు సోకిన కొమ్మలు మరియు ఆకులను తొలగించి నాశనం చేయాలి. కాపర్ఆక్సిక్లోరైడ్ 50 WP @ 30 g + స్ట్రెప్టోసైక్లిన్ 1 g 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **నేరేడు** - ఏప్రిల్ నెలలో పండ్లు ఊరే దశలో లీటరు నీటికి 10 గ్రాముల యూరియా మరియు 5 గ్రాముల సూక్ష్మపోషకాల మిశ్రమం (ఫార్ములా-4) కలిపి పిచికారీ చేయాలి. ఈ మిశ్రమం వాడటం వల్ల పండ్ల నాణ్యత మరియు పరిమాణం గణనీయంగా మెరుగుపడుతుంది.

ఔషధ మరియు సుగంధ మొక్కలు

- **అలోవెరా** - పంట కోతకు సిద్ధంగా ఉంటుంది. అలోవెరా పంట పూర్తిగా ఎదగడానికి 18–24 నెలలు పడుతుంది. ఇది బహువార్షిక పంట కాబట్టి ప్రతి 4 నెలలకు ఒకసారి కోత చేయాలి. ప్రతి మొక్క నుండి 3–4 ఆకులను కోయాలి.
- **అశ్వగంధ** - పొలం లే అవుట్ సిద్ధం చేసి విత్తనాలను విత్తాలి. విత్తే ముందు విత్తనాలను థైరమ్ (Thiram) లేదా డైథేన్-45 (Dithane-45) మందులతో 3 గ్రా/కిలో విత్తనం మోతాదులో శుద్ధి చేయాలి. ఇలా చేయడం వల్ల విత్తనాల ద్వారా వచ్చే వ్యాధుల నుండి మొక్కలు రక్షించబడతాయి.
- **లెమన్‌గ్రాస్** - భూమిని దున్నే సమయంలో ఎకరానికి 10 కిలోల లిండేన్ పొడిని నేలలో కలపాలి, దీని ద్వారా చీడపీడల దాడి నుండి పంటను రక్షించవచ్చు. లెమన్‌గ్రాస్ నాటడం ఎత్తైన మడుగులపై చేయాలి. OD-19, ప్రగతి, కావేరి, కృష్ణ వంటి మంచి రకాలను ఎంపిక చేయాలి.
- **జెరానియం** - అవసరానికి అనుగుణంగా నీరు అందించాలి. కలుపు తొలగించడం మరియు అవసరమైన మొక్క సంరక్షణ చర్యలు చేపట్టాలి.

- **పుదీనా** - 100–120 రోజుల్లో దిగువ ఆకులు పసుపు రంగులోకి మారినప్పుడు కోత చేపట్టాలి. కోత సమయంలో నేలపై నుంచి 2–3 సెం.మీ ఎత్తులో కొడవలితో కోయాలి. తరువాతి కోతను 80 రోజుల వ్యవధిలో (మల్టీకట్ పద్ధతి) సరైన దశలో చేయాలి.
- **తులసి** - నేల ద్వారా వచ్చే వ్యాధులు మరియు పురుగుల నివారణ కోసం విత్తే ముందు విత్తనాలను మాంకోజెబ్ @ 5 గ్రా./కిలో విత్తనానికి శుద్ధి చేసుకోవాలి.
- **వాము** - రబీ పంట కోత తర్వాత 2-3 రోజులు ఆరబెట్టి, ఆపై నూర్పిడి మరియు శుభ్రం చేసిన విత్తనాలను గన్నీ సంచులలో భద్రపరచండి.
- **ధనియాలు** - విత్తిన ధనియాల పంటకు ఎండల తీవ్రత నుండి రక్షణ కోసం క్రమం తప్పకుండా తేలికపాటి నీటి తడులు ఇవ్వండి. పంట ఏపుగా పెరగడానికి పొలంలో ఉన్న కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసివేసి శుభ్రంగా ఉంచండి.
- **మెంతులు** - పంట పూత మరియు కాయ దశలో ఉన్నప్పుడు తేలికపాటి నీటి తడులు అందించాలి. పంట శారీరక పక్వదశకు చేరుకున్నప్పుడు కోతను ప్రారంభించాలి. కోత కోసిన తర్వాత, ఆ మొక్కలను పొలంలోనే 2 నుండి 3 రోజుల పాటు ఆరబెట్టాలి.
- **ఆయిల్‌పామ్** - పెరిగిన ఆయిల్‌పామ్ తోటల్లో ప్రతి మొక్కకు రోజుకు 160–200 లీటర్ల నీరు ఇవ్వాలి, దీంతో మట్టి తేమ బాగా ఉంటుంది. వేడి, పొడి వాతావరణం మరియు గుబురు చాటు ఉన్న తోటల్లో లీఫ్ వెబ్‌వార్మ్ సమస్య రావచ్చు; నియంత్రణ కోసం Beauveria bassiana @ 5 ml/L స్ప్రే చేయాలి, తీవ్ర దెబ్బతినే పరిస్థితిలో లాంబ్డా-సైహాలోత్రిన్ లేదా ఇండోక్సాకార్బ్ @ 1 ml/L స్ప్రే చేసి 15 రోజుల తర్వాత మళ్లీ పునరావృతం చేయాలి.

**పూలు**

- **చామంతి** - చామంతి పూల కోత పూర్తయిన తర్వాత, భూమిపై ఎండిన కొమ్మలను తొలగించడం వల్ల మొక్క శక్తి వృధా కాకుండా కొత్త పిలకలు ఆరోగ్యంగా వస్తాయి. ఈ సమయంలో ఎకరానికి 36 కిలోల యూరియా అందించి వెంటనే నీరు పెట్టడం వల్ల, మొక్కలకు కావల్సిన నత్రజని అంది పిలకలు వేగంగా, ఏపుగా పెరుగుతాయి. ఈ ప్రక్రియ వల్ల, తర్వాతి సాగుకు అవసరమైన నాణ్యమైన నారు సిద్ధమవుతుంది.
- **బంతి** - పూర్తిగా అభివృద్ధి చెందిన పువ్వులు తెల్లవారుజామున లేదా సాయంత్రం వేళల్లో కోయబడతాయి. పంట కోతకు ఒక రోజు ముందు తేలికపాటి నీటిపారుదల ఇవ్వాలి. మంచి నాణ్యమైన పువ్వుల కోసం వారానికి విరామంలో 4 మి.లీ చొప్పున 13-0-45 మరియు 2 మి.లీ సూక్ష్మ ధాతు మిశ్రమాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **రజనీగంధ** - మూడు సంవత్సరాలు పూర్తయితే. గడ్డలను తొలగించండి. తదుపరి నాటడానికి గడ్డలను శుభ్రం చేసి వేరు చేయండి. సహజ నిద్రాణస్థితిని తొలగించడానికి 3--45 రోజులు మంచి గాలి ప్రసరణతో నీడలో చల్లని మరియు పొడి ప్రదేశంలో నిల్వ చేయండి.